రేషన్, పెన్షన్ ఇంటికే..

వాహనాల ద్వారానే సరుకుల పంపిణీ
కసరత్తు చేస్తున్న అధికారులు

భీమవరం టౌన్, జూన్ 26 :జులై నెలకు సంబంధించి ఇంటికే రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నారు. ఇప్పటి వరకు ఉన్న వాహనాల ద్వారానే లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తారు. జిల్లా వ్యాపంగా ప్రతీనెల దాదాపు 6 వేల టన్నుల బియ్యాన్ని పంపిణీ చేసేవారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దకు రేషన్ బియ్యం చేరగా అక్కడ నుంచి డీలర్లకు రేషన్ కేటాయించనున్నారు. డీలర్లు వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తారు. వారం రోజుల పాటు సరుకులు అందజేస్తారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత డీలర్ల ద్వారా రేషన్ దుకాణాల వద్దే సరుకులు అందజేస్తారని అంతా భావించారు. ఆ దిశగానే ప్రచారం సాగింది. ప్రభుత్వ స్థాయిలో మాత్రం దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఇంటివద్దకే రేషన్ అందించేందుకు అధికారలు కసరత్తు చేస్తున్నారు. వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేందుకు ప్రభుత్వంపై అదనపు భారం పడుతోంది. వాహనదారులకు నెలకు 15 వేలు ప్రభుత్వం చెల్లిస్తోంది.డీలర్లకు కమీషన్ సొమ్ములు అందజేస్తున్నారు. లబ్ధిదారులు కూడా రేషన్ వాహనం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వస్తోంది. మరోవైపు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్‌ను ఇంటింటికీ అందించేవిధంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే మంత్రివర్గంలో చర్చించి ఆమోదం తీసుకున్నారు. జిల్లాలో 2 లక్షల 34 వేల మంది పెన్షన్‌దారులు ఉన్నారు. వీరిరందరికి ఇంటికే పెన్షన్ అందించనున్నారు. ఎన్నికల సమయంలో పెన్షన్ రూ.4 వేలు ఇస్తామని ప్రకటించినట్టుగానే కూటమి ప్రభుత్వం పెన్షన్ అందించనుంది. సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ అందించేందుకు కసరత్తు చేపడుతున్నారు.

34 శాతం పాస్

ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ ఫలితాలు

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 26 : ఇంటర్ ఫస్టియర్ జనరల్, ఒకేషనల్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలైనట్టు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ జనరల్ విభాగంలో 4,256 విద్యార్థులు పరీక్ష రాయగా 1445 మంది (34 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ 417 మంది పరీక్ష రాయగా 163 మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులు మార్క్స్ మెమోలను జూలై 1వ తేదీ నుంచి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అఫీషియల్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. రీవెరిఫికేషన్ కోసం ఈ నెల 28 నుంచి జూలై నెల 4వ తేదీలోపు అఫీషియల్ వెబ్‌సైట్‌లో అప్లికేషన్ ఫీజు రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

డ్రెయిన్ల ప్రక్షాళన



గునుపూడి పాత డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

మురుగు కాల్వల్లో తూడు, డెక్క తొలగింపు

జలవనరుల శాఖ వేగం పుంజుకుంటున్నది. నిమ్మల రామానాయుడు జలవనరుల శాఖ మంత్రిగా పదవి చేపట్టినప్పటి నుంచి రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. దానికి తగ్గట్లుగానే మంత్రి కాల్వల ప్రక్షాళనపై దృష్టి పెట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రైతులు సాగులో ఎన్నో ఇబ్బందులు పడ్డారు. రెండు రోజుల క్రితం జలవనరులశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించి డ్రెయిన్ వివరాలతో పాటు పనుల ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఆ మరుసటి రోజుకే కాలువల గుర్రపుడెక్క, చెత్త ప్రక్షాళనకు అవసరమైన నిధులు మంజూరయ్యాయి.

- జలవనరుల శాఖ వేగం
- రెండు రోజుల క్రితం అధికారులతో మంత్రి నిమ్మల సమావేశం
- 66 పనులకు ప్రతిపాదనలు..
- 52 పనులకు ఆమోదం
- రూ.9.98 కోట్లు నిధులు మంజూరు
- 27 నుంచి 4 వరకు టెండర్ల ప్రక్రియ

భీమవరం రూరల్, జూన్ 26 : గడిచిన వేసవిలో జరగాల్సిన డ్రెయిన్లలో గుర్రపుడెక్క, చెత్త తొలగింపులపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం నిధులు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. దీంతో జిల్లాలో 66 పనులు ప్రతిపాదనలు వెళ్లినా అవి అలాగే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వంలో రెండురోజుల క్రితమే 66 పనులకు ప్రతిపాదనలు వెళ్లడం 52 పనులకు వెనువెంటనే రూ.9 కోట్లు 98 లక్షలు మంజూరు చేశారు. పనులు కూడా పరుగులు పెట్టించాలని మంత్రి నుంచి అధికారులకు సూచనలు వచ్చాయి. ఈనెల 27 తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకు కాలువలలో చేయవలిసిన పనులకు టెండర్లు వేయనున్నట్లు అధికారులు తెలిపారు. సార్వా నాట్లు పూర్తయ్యే సరికి మురుగునీటి అడ్డంకులు తొలుగనున్నాయి.

66 పనులకు ప్రతిపాదనలు

వరిసాగుకు వర్షపునీటి ముంపు భారం కాకూడదంటే జిల్లాలో మురుగు డ్రెయిన్లలో 66 పనులు చేయాలని అధికారులు గుర్తించి ప్రతిపాదనలు పంపారు. 52 పనులకు యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. మిగిలిన 14 పనులు కీలకంగానే ఉన్నాయి. ఇవి సముద్ర తీర ప్రాంతం అయిన నాగిడిపాలెం, పెదకాపారం వంటి ప్రాంతాల్లోని డ్రెయిన్లలో కిక్కిస తొలగింపు చేపట్టాలి. పైన కాల్వల్లో గుర్రపుడెక్క తొలగించినా కిక్కిస అడ్డుగా మారుతుంది. కిక్కిస తొలగింపుపైన అధికారులు దృష్టి పెట్టాల్సిందే. జలవనరులశాఖ లెక్క ప్రకారం జిల్లాలో 2,080 కిలోమీటర్లు పొడవునా డ్రెయిన్లు ఉన్నాయి. వీటిలో 21 మేజర్ డ్రెయిన్లు, 59 మీడియం డ్రెయిన్లు , ఉండగా 579 మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. అధికారులు దృష్టి పెడితేనే వరిసాగులో ముంపు దెబ్బ తగలకుండా ఉంటుంది.

సాగు విస్తీర్ణం పెరుగుతుంది

డ్రెయిన్లలో గుర్రపుడెక్క తొలగిస్తే మురుగునీటి ప్రవాహం పెరుగుతుంది. దీంతో సార్వా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుంది. రెండేళ్లుగా సార్వాలో 2 లక్షల ఎకరాలలో మాత్రమే సాగు జరుగుతుంది. 50 వేల ఎకరాల సాగు ముంపు భయంతో సాగడం లేదు. గడిచిన సార్వాలో అయితే తుఫాన్ దాటికి లక్ష 25 వేల ఎకరాల్లో పంట పూర్తిగా ముంపునకు గురైంది. మురుగునీరు 20 రోజుల పాటు పొలాల్లో ఉండిపోవడంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఈ సార్వాలో 2 లక్షల 11 వేల ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా. చెత్త తొలగింపు పనులు మొదలు పెడితే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుంది.



మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

యువత మత్తుకు దూరంగా ఉండాలి

భీమవరంటౌన్, జూన్ 26 :యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల నియంత్రణకు అందరు సహకరించాలని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, జిల్లా జాయింటు కలెక్టరు ప్రవీణ్ ఆదిత్య కోరారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జువ్వలపాలెం రోడ్డు నుంచి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీవీ రాజు కాలేజీ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎస్పీమాట్లాడుతూ డ్రగ్స్ రహిత జిల్లాగా చేసేందుకు సహకరించాలన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం చేస్తే ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు.జేసీ ఆదిత్య మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని,యువత మత్తు పదార్థాల వైపు మరలకుండా అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. వైద్య, ఆరోగ్యం, రెవెన్యూ, విద్య, అటవీ, డ్రగ్స్ తదితర శాఖల అధికారులు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు. వైద్యాధికారులు, ఏరియా హాస్పిటల్స్, సీహెచ్‌సీలలో ఎక్కడైనా మాదక ద్రవ్యాలు సేవించి ఎవరైనా వస్తే అలాంటి వారి వివరాలను పోలీసు శాఖకు అందజేయాలని సూచించారు. వీఆర్‌ఏ, వీఆర్‌వోలకు గ్రామాల్లో డ్రగ్స్ సేవిస్తున్న వారి వివరాలను తెలియజేసేలా ఆదేశాలు జారీ చేయాలని ఆర్డీవోలకు సూచించారు. విద్యార్థిని, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సెబ్ ఏఎస్పీ రవికుమార్, బీవీ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వేణు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, స్టూడెంటు కో-ఆర్డినేటరు రంగారావు పాల్గొన్నారు.

వీడని రేవు పంచాయితీ

ప్రభుత్వానికి రూ.45 లక్షలు బాకీ..రెండ్రోజుల్లో జేఏసీ సమావేశం



నరసాపురం, జూన్ 26: రేవు నిర్వహణదారుడు ప్రభుత్వానికి షాక్ ఇచ్చారు. రోజువారీ మొత్తాన్ని చెల్లించకుండా రూ.45 లక్షలు బకాయి పడ్డాడు. ఇది వసూలు చేసేందుకు అధికారులు అతనికి ఇప్పటి వరకు ఎనిమిది నోటీసులు ఇచ్చారు. అయినా స్పందన లేదు. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఈ విషయమై జేఏసీ కమిటీ శుక్రవారం సమావేశంలో చర్చించి ఓ నిర్ణయం తీసుకోనుంది. ఈ ఏడాది మార్చిలో 2024-25 సంవత్సరానికి గాను మాధవాయి పాలెం రేవు పాట నిర్వహించాలని అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో పాట వాయిదా పడింది. దీంతో అప్పటి వరకు రేవు నిర్వహించిన పాత పాటదారుడినే ఏప్రిల్ నుంచి రేవు నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని జేఏసీ కోరింది. రోజుకు రూ.1.05 లక్షల చొప్పున కట్టే విధంగా ఒప్పందం జరిగింది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పాత బకాయి రూ 3.62 కోట్లలో పెండింగ్ ఏమీ లేకపోవడంతో జెఏసీకి అతనిపై నమ్మకం కలిగింది. మొదట్లో పాట దారుడు రోజువారీ కడుతూ వచ్చాడు. అయితే అధికా రులంతా ఎన్నికల బీజీలో పడడంతో బకాయి పెరుగుతూ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు నోటీసులు ఇవ్వడం మొదలు పెట్టారు. ఇదిగో.. అదిగో అంటూ తేదీలు చెప్పుతూ వాయిదాలు వేస్తూ వచ్చాడు. గత వారం సమావేశమైన జేఏసీ సభ్యులు హైదరాబాద్‌లో ఉన్న అతనితో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెల 21న రూ.35 లక్షలు కడతానని కమిటీకి హామీ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు సొమ్ము చెల్లించలేదు. అధికారులు మాత్రం రోజుకు రూ.75 వేలు చొప్పున రేవు నిర్వహిస్తున్న అతని సిబ్బంది వద్ద నుంచి వసూలు చేస్తూ వచ్చారు. పాత బాకీ అలాగే ఉంది. ఈ విషయాలన్నీ ప్రభు త్వానికి చేరడంతో అధికారులు సీరియస్ అయ్యారు. తక్షణం బాకీ వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం సమావేశమై బాకీ వసూలుపై ఓ నిర్ణయం తీసుకుంటుందని ఎంపీడీవో రమణరావు చెప్పారు.

ఆశలన్నీ నిమ్మలపైనే..

పాలకొల్లులో ఎదురుచూస్తున్న సమస్యలు
టిడ్కో గృహాలు అప్పగించాలి
కళాక్షేత్రం పునఃనిర్మాణం చేపట్టాలి
తాగునీరు, ట్రాఫిక్ ఇక్కట్లు తీర్చాలి



టిడ్కో గృహాలు

పాలకొల్లు అర్బన్, జూన్ 26 :వాణిజ్య కేంద్రంగా, కళాకారుల నిలయంగా ప్రసిద్ధి చెందిన పాలకొల్లు పట్టణంలోని సమస్యల పరిష్కా రంపై నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడిపైనే పట్టణ ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. టిడ్కో గృహాలు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

- 2019 ఎన్నికలకు ముందు పట్టణ శివారు ప్రాతం పెంకుళ్ళపాడు వద్ద సుమారు 60 ఎకరాల్లో పేద ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టిడ్కో గృహాలను నిర్మించాయి. 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఎన్నికలు రావడంతో ఇళ్లను అందించలేకపోయారు. 2019 ఎన్నికల ముందు జగన్ పాలకొల్లు వచ్చిన సమయంలో టిడ్కో గృహాలను పూర్తిగా ఉచితంగా అందిస్తానని హామీ ఇచ్చారు. ఇది నమ్మి ఓట్లు వేసిన వారికి ఐదేళ్లలో నిరాశే మిగిలింది. సుమారు 7000 గృహాలు నిర్మించగా వాటికి వైసీపీ రంగులు వేసుకోవడం తప్ప చేసింది శూన్యం. ఏడు వేల గృహాలకు గత ఏడాది 3,800 మందికి ఇళ్లను అందజేశారు. మిగిలిన గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించాలి. ఇళ్లకు ఇచ్చిన రుణాలను చెల్లించాలని బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు నోటీసులు రావడంతో లబ్ధిదారులు ఆందోళనలో ఉన్నారు. దీనిపై మంత్రి దృష్టి సారించి పేదలకు రుణాలు చెల్లించే అవసరం లేకుండా గృహాలను అందించాలని ప్రజలు కోరుతున్నారు.
- పట్టణంలో రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయించాలి. ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రైలు గేటు వద్ద ట్రాఫిక్ సమస్య నివారణకు అండర్ పాస్ వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.
- పట్టణ ప్రజలకు మంచినీరు అందించాలని, దవళేశ్వరం నుంచి నేరుగా పైపు లైన్ల ద్వారా గోదావరి జలాలు తీసుకువచ్చి అందించే ప్రతిపాదన అమలు చేయాలని కోరుతున్నారు.
- పట్టణంలో దీర్ఘకాలంగా పట్టి పీడిస్తున్న డ్రైయినేజీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. సుమారు 14 వార్డు ప్రజలకు ఉపయోగపడే దమ్మయ్య పర్తి డ్రైయిన్ (కోడు) ఆక్రమణలు తొలగించి పూర్తిస్థాయిలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

కళాకారులకు ఎంతగానో ఉపయోగపడే బీవీ రాజు గుప్త, ఎన్‌టీఆర్ కళాక్షేత్రం నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. బీవీ రాజు గుప్త ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఇన్‌డోర్ ఆడిటోరియంగా మార్చాలన్న సంకల్పంతో సుమారు ఎనిమిదేళ్ల క్రితం సుమారుగా రూ.6 కోట్లతో పనులు చేపట్టి దాదాపుగా 80 శాతం పూర్తి చేశారు. ఎన్నికలు రావడంతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కళాక్షేత్రం నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. మంత్రి దృష్టి పెట్టి పనులు చేపట్టకుంటే శిథిలావస్థకు చేరుతుందని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.



అసంపూర్తిగా ఉన్న బీసీ కమ్యూనిటీ భవనం..



భీమవరం రోడ్డులో ఉన్న రైల్వే గేటు



యాళ్ళవాని గరువు వంతెన వద్ద పేరుకుపోయిన చెత్త

ప్రజల ప్రాణాలతో వ్యాపారమా ?



కుళ్లిన మాంసం విక్రయాలు
హోటల్స్‌లోనూ అదే తీరు
వీధివీధినా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు
తనిఖీలు చేపట్టని అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 26 : హోటల్స్, మాంస విక్రయ కేంద్రాలు ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్నాయి. ఒక పక్క కలుషిత ఆహారం, మరో పక్క నిల్వ ఉంచిన ఆహారం కారణంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. దానికి తోడు అధికారుల పర్యవేక్షణ లోపం అలాంటి వ్యాపారాలకు మరింత ఊతం ఇస్తున్నాయి. తాడేపల్లిగూడెం పట్టణంలో శనివారం ఓ చికెన్ దుకా ణంలో మహ్మద్ ఆలి అనే వ్యక్తి రూ.400 విలువ చేసే మాంసం కొనుగోలు చేసి ఇంటికి వెళ్లి చూసేసరికి వాసన వస్తుండడంతో మళ్లీ ఆ దుకాణం వద్దకు వెళ్లి అడిగితే ఆ వ్యాపారి సమాధానం చెప్పకపోగా దౌర్జన్యానికి దిగాడు. దీంతో అతను మున్సిపల్ అధికారులను సంప్రదించగా అది తమ పరిధి కాదని చేతులెత్తేశారు. దీంతో ఏం చేయలేని పరిస్థితుల్లో మీడియాను ఆశ్రయించాడు. ఇంత రచ్చ జరిగితే వారం రోజుల తరువాత ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధ వారం ఆ దుకాణాన్ని పరిశీలించారు. కానీ కలుషిత ఆహారం తినడం, కుళ్లిన మాంసం తినడం వల్ల ఇబ్బంది పడుతున్న వారు రోజూ పదుల సంఖ్యలో ఉంటారు.


పుట్టగొడుగుల్లా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు

జిల్లాలో ఏ ప్రాంతంలో చూసినా ఏ సందులో చూసినా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా ఉంటున్నాయి. ఆయా సెంటర్‌ల వద్ద తాజాగా ఉండే పదార్థాల కన్నా ఫ్రిడ్జ్‌లో ఉంచి వడ్డించే ఆహార పదార్థాలే ఎక్కువ. ఒకరోజు వ్యాపారం లేకపోతే మిగిలిన మాంసం, రొయ్యలు ఫ్రిడ్జ్‌లో పెట్టి మరుసటి రోజు వినియోగించడం సర్వసాధారణం అయింది. హోటల్స్‌లో అయితే నాలుగు రోజుల నిల్వ ఉన్న వాటినీ కూడా వాడుతుంటారు. వాటన్నింటికి కారణం అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే. ఇటీవల విజయవాడలో ఓ హోటల్‌లో కుళ్లిన మాంసం, బూజుపట్టిన ఆహార పదార్థాలు బయట పడ్డాయి. గతంలో తాడేపల్లిగూడెంలో ఓ హోటల్ పేరుతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ప్రారంభించి కుళ్లిన కోడిగుడ్లు వాడినన ఘటన కూడా వెలుగు చూసింది.

లైసెన్స్ లేని చికెన్ సెంటర్‌లు

మాంసం విక్రయ కేంద్రాలు కూడా ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్నారు. కనీస పరిశుభ్రత లేకుండా ఉండటం గంటల తరబడి మాంసం వేలాడ దీస్తూ విక్రయాలు చేయడం వల్ల దుమ్ము, దూళి, ఈగలు వాలడం వల్ల అది అపరిశుభ్రమవుతోంది. మాంసం ఎప్పటికప్పుడు తయారు చేసి విక్రయించే దుకాణాలు చాలా తక్కువగా ఉంటున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించకపోవడం వల్ల ఇలాంటివి జరుగుతున్నాయి. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మండలానికి ఒకరు ఉండేవారు. కానీ ప్రస్తుతం ఫుడ్ సేఫ్టీ అధికారులు జిల్లాకి ఒకరు ఇద్దరు ఉండటం వల్ల పర్యవేక్షణ కొరవడుతున్నది. ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.

నిరంతర నిఘా ఉండాలి



మాంసం విక్రయ కేంద్రాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లపై నింతర నిఘా ఉండాలి. అనుక్షణం వినియోగదారుల కోసం నేను పోరాడుతూనే ఉన్నారు.ఈ చికెన్ షాపు వ్యవహారంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాం. కానీ అన్ని చోట్లా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉండదు. ప్రభుత్వమే తనిఖీలు తరచుగా చేయిస్తే అంతా అప్రమత్తంగా ఉంటారు.ప్రజల ప్రాణాలకు రక్షణ ఉంటుంది.

- హనుమంతరావు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు, తాడేపల్లిగూడెం

శుభ్రత పాటించకపోతే చర్యలు

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, మాంసం విక్రయ కేంద్రాలకు లైసెన్స్‌లు తప్పనిసరి. కానీ చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే వారు లైసెన్స్‌లు తీసుకుని వ్యాపారం చేసుకునేంత సాహసం చేయరు. కానీ వారు ప్రజలకు అందించే మాంసం, లేక ఆహార పదార్థాలు శుచిగా, శుభ్రంగా ఉంచాలి. అలా లేనివారిపై మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

సుందర రామిరెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి, భీమవరం



తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

తాడేపల్లిగూడెంలో కుళ్లిన చికెన్ విక్రయించారనే ఫిర్యాదుతో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి సుందర రామిరెడ్డి బుధవారం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్ షాపుకు లైసెన్స్ లేకపోవడం, మాంసం ఆరు బయట వేలాడ దీసి విక్రయిం చడం, షాపులో అపరిశుభ్ర వాతావరణం ఉండడంపై ఆయన కేసు నమోదు చేశారు. వెంటనే లైసెన్స్ తీసుకుని నిబంధనల ప్రకారం మాంసం విక్రయించకపోతే షాపు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

చిన్నారికి మంత్రి నిమ్మల వైద్య సాయం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని పలకరిస్తున్న మంత్రి రామానాయుడు

పాలకొల్లు టౌన్, జూన్ 26 : పాలకొల్లుకు చెందిన పదమూ డు నెలలు చిన్నారి అక్షర కిడ్నీ సమస్యతో బాధపడుతున్న తీరును, ఆరోగ్య పరిస్థితిని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి చిన్నారి తల్లిదండ్రులు వివరించారు. ఈమేరకు ఆయన స్పందించి వైద్యసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. విజయవాడ మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని బుధవారం రాత్రి ఆయన వెళ్లి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు. చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ అధైర్య పడొద్దని, ప్రభుత్వ సాయం అందుతుందని, రూపాయి ఖర్చు పెట్టనవసరం లేదని అంతా చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఆసుపత్రిలో ఏదైనా ఇబ్బంది వస్తే తనకు ఫోన్ చేయాలని సూచించారు. ఆయనకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మళ్లీ పులి భయం..

» సున్నాలగండిలో మేకను చంపిన చిరుత

పోలవరం, జూన్ 26 : చిరుత పులి దాడిలో మేక మృతి చెందిన ఘటన పోలవరం మండలం వింజరం పంచాయతీ సున్నాలగండి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలవరం అటవీక్షేత్రాధికారి ఎస్.దావీదురాజు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన మడకం కోటేశ్వరరావు అనే మేకల కాపరికి చెందిన పాకలో ఒక మేక కనిపించక పోవడంతో సమీప అటవీ ప్రాంతంలో వెతికినట్టు తెలిపారన్నారు. మేకల పాకకు కొంతదూరంలో తలభాగం పూర్తిగా తిని మిగిలిన మేక కళేబరం కనిపించిందని మేకల కాపరి ఇచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతానికి అటవీశాఖ సిబ్బందిని పంపినట్టు తెలిపారు. సిబ్బంది సేకరించిన పాదముద్రల మేరకు దాడికి పాల్పడింది చిరుతపులేనని ధ్రువీకరించినట్టు తెలిపారు. మేక కళేబరాన్ని పశువైద్యులతో పరీక్షించి మేకల కాపరికి అటవీశాఖ నుంచి పరిహారం అందిస్తామని.. అడవుల్లోకి పశువులను మేపడానికి వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులకు సూచించినట్టు తెలిపారు.


మేక కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

పొగాకు @ 363

» ఆల్‌టైమ్ రికార్డుకు చేరుకున్న వర్జీనియా ధర
» రైతుల హర్షం

జంగారెడ్డిగూడెం, జూన్ 26 : ఎస్‌ఎల్‌ఎస్ చరిత్రలోనే ప్రప్రథమంగా వర్జీనియా పొగాకు ధర బుధవారం రూ.363కు చేరి ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. ఇంతటి ధర మునుపెన్నడూ లేకపోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2024 మార్చి ఆరో తేదీన జంగారెడ్డిగూడెంలో రెండు వేలం కేంద్రాల్లో వేలం ప్రారంభమైంది. అప్పటి ప్రారంభ ధర రూ.240 మాత్రమే ఉంది. ఆ ధర చూసిన రైతుల్లో నిరుత్సాహం నెలకొంది. వేలం చివరి వరకు ఇదే ధర కొనసాగితే రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వచ్చేది. క్రమక్రమంగా ధరలు రైతులకు ఆశాజనకంగా పెరగడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఈనెల 20న రూ.266 ఉండగా 22వ తేదీకి రూ.272, 24వ తేదీకి రూ.287, 25వ తేదీకి రూ.303కి చేరుకోగా 26వ తేదీ బుధవారం నాటికి ఏకంగా వేలం కేంద్రం-1లో రూ.361, వేలం కేంద్రం-2లోను, కొయ్యలగూడెం వేలం కేంద్రంలోనూ అత్యధిక ధర రూ.363కు చేరుకుంది. పొగాకు వేలం చరిత్రలో ఇంతటి ధర పలకడం ఇదే ప్రథమం అని జంగారెడ్డిగూడెం రెండు వేలం కేంద్రాల ఆక్షన్ సూపరింటెండెంట్‌లు బి.శ్రీహరి, జె.సురేంద్రకుమార్ ఆంధ్రజ్యోతి తెలిపారు. వేలం కేంద్రం 32 నంబరు రైతు సంఘం అధ్యక్షుడు సత్రం వెంకట్రావు మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు వేలం ప్రారంభంలో రూ.240 నుంచి క్రమక్రమంగా రూ.363కి చేరడంపై రైతులు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. వేలం ఆఖరి వరకూ ఇదే ధర వస్తే మిచౌంగ్ తుఫాన్‌లో నష్టపోయిన రైతులకు చాలా వరకు ఊరట కలుగుతుందన్నారు.


వేలం కేంద్రంలో అధికారులు, కంపెనీల ప్రతినిధులు


జీలుగుమిల్లి పామాయిల్ తోటలో తాచుపాములు

తాచు పాముల హల్‌చల్

జీలుగుమిల్లి, జూన్ 26 :జీలుగుమిల్లి గ్రామ సమీప పామాయిల్ తోటలో రెండు తాచు పాములు బుధవారం మసకలాడు తున్నాయి. పొలం పనులకు వచ్చిన కూలీలు కొందరు పామాయిల్ తోటలో రెండు తాచుపాముల్ని చూసి భయాందోళనకు గురయ్యారు. రైతుకు సమాచారం ఇచ్చారు. రైతు ప్రసాద్ అక్కడకు చేరుకుని రెండు పాములు పెనవేసుకుని నాట్యం చేస్తున్నట్టు ఆడుతున్న దృశ్యాల్ని సెల్‌ఫోన్‌లో బంధించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

మహిళలకు న్యాయం జరగాలి

» ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశం


దిశ పోలీస్ స్టేషన్‌లో మహిళల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ ప్రశాంతి

ఏలూరు క్రైం, జూన్ 26 : నాలుగు గోడల మధ్య ఉండే మహిళలు మహిళా పోలీస్ స్టేషన్‌కు వస్తున్నారంటే వారి బాధను అర్థం చేసుకుని వారికి న్యాయం జరిగేలా ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి ఆదేశించారు. ఏలూరులో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ వద్దకు వచ్చిన పలువురు ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విశ్వం, ఎస్‌ఐ కాంతిప్రియ నుంచి స్టేషన్‌లో కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని, ప్రతి ఫిర్యాదును రిసెప్షన్ సెంటర్‌లో నమోదు చేసి రసీదు ఇవ్వాలన్నారు. కేసు దర్యాప్తులో అలసత్వం వహించరాదని అధికారులను హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల బాధలను సహృదయంతో మాట్లాడి సమస్య తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని, పోలీస్ స్టేషన్ ప్రాంతం పచ్చదనంగా ఉండేలా మొక్కలను నాటాలని సూచించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠినచర్యలు : ఈఈ


మధుకుమార్

పెదవేగి, జూన్ 26 : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యుత్ తనిఖీ విభాగం ఈఈ కె.మధుకుమార్ హెచ్చరించారు. బుధవారం లక్ష్మీపురం గ్రామంలో సూరెడ్డి వెంకటేశ్వరరావు, సూరెడ్డి సుభాషిణి అనే ఇరువురు వ్యక్తులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారనే సమాచారంతో దాడులు చేసి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన సూరెడ్డి వెంకటేశ్వరరావు వ్యవసాయ సర్వీసునుంచి పశువులశాలకు విద్యుత్‌ను అక్రమంగా వినియోగాన్ని గుర్తించడంతో పాటు అదనపు లోడును వినిగిస్తున్నట్లు గుర్తించి దానిపైకూడా నమోదు చేశామన్నారు. అదే గ్రామానికి చెందిన సూరెడ్డి సుభాషిణి కేటగిరి-1 ఇంటి సర్వీసునుంచి విద్యుత్‌ను తీసుకుని తనకు చెందిన నాటుకోళ్ల ఫారమ్‌కు అక్రమంగా వినియోగిస్తున్నట్టు గుర్తించి ఆమెపై కేసునమోదు చేశామన్నారు. విద్యుత్ అక్రమ వినియోగం నేరమని, ఎవరైనా విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నట్టు తేలితే జరిమానాతో పాటు చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీవారి క్షేత్రానికి నాగసాధువులు


శ్రీవారి అనివేటి మండపం వద్ద నాగసాధువులు

ద్వారకాతిరుమల, జూన్ 26: చినవెంకన్న క్షేత్రాన్ని పలువురు నాగ సాధువులు బుధవారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన వీరిని తిలకించిన భక్తులు పరవశిం చారు. వారణాసిలో ఉండే ఈ సాధువులు శివభక్తులుగా చెబుతారు. తాము కాశీనుంచి వచ్చినట్టు వారు తెలిపారు. ఆలయంలో కన్పించిన ఈ నాగసాధువులకు పలువురు భక్తులు ప్రణామాలు తెలిపారు. అరుదుగా కన్పించే వీరిని ఆలయానికి వచ్చిన భక్తులు ఆసక్తిగా తిలకించారు.

భయం.. భయం



వాతావరణం మార్పులతో ప్రజలు సతమతం అవుతున్నారు. ఓవైపు వాన, మరోవైపు ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ మార్పుల కారణంగా ప్రజలు రోగాలభారిన పడుతామన్న భయాందోళన వ్యక్తం అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో డెంగీ, వైరల్ ఫీవర్స్‌లాంటివి ప్రజలను ఇబ్బందులకు గురిచేశాయి. గ్రామాల్లో పారిశుధ్య నిర్వాహణ అంతంతమాత్రంగా ఉండడంతో పాటు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో ఎటువంటి రోగాల భారిన పడాల్సి వస్తుందోనన్న భయం వెంటాడుతోంది.

వాతావరణ మార్పులతో ప్రజలు సతమతం



» వ్యాధుల భారిన పడతామన్న ఆందోళన
» అతిసార వ్యాధిపై జిల్లా వైద్యశాఖ అప్రమత్తం
» పోస్టర్లతో అవగాహన, ప్రచార కార్యక్రమాలు

భీమవరంటౌన్, జూన్ 26 : ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో ఇప్పటికే పలువురు దగ్గు, రొంప, జ్వరాలతో ఇబ్బందులు పడున్నారు. చిన్న పిల్లలోను జ్వర లక్షణాలు కనిపించడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.జిల్లా వైద్యాధికారులు కూడా గ్రామాల్లోను, పట్టణాలోని వార్డుల్లోనూ జ్వరాలపై సర్వేలు చేయిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి వివరాలను సేకరించుకుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డయేరియా వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో అటువంటి సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జిల్లా వైద్యశాఖాధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. వర్షకాలం ప్రారంభం కావడంతో అతిసార ప్రభలే అవకాశాలు ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. గత రెండేళ్లుగా ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎక్కడా అతిసారవ్యాధి కేసులు నమోదు కాలేదు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సరైన పారిశుధ్య నిర్వహణ చేపట్టకపోవడం, స్వచ్ఛమైన తాగునీరు అందించే విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టకపోవడం ఈ వ్యాధులు ప్రభలే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టిపెట్టింది. జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఇప్పటికే ఏఎన్‌ఎంలకు, ఎంఎల్‌హెపీ, పీహెచ్‌సీ డాక్టర్లు, సచివాలయల్లో ఏఎన్‌ఎంలకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటుచేసి ముందస్తు చర్యలు నిర్వహిస్తున్నారు.

గ్రామాల వారీగా కమిటీలు

అతిసార వ్యాధి రాకుండా ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా గ్రామాల వారీగా వైద్యశాఖ ఆధ్వర్యంలో మండల టాస్క్‌పోర్సు కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కమిటీలో వైద్యాధికారులు, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖలు కమిటీలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. పలు సూచనలు జారీ చేశారు. గ్రామాల్లో మంచినీటి పైపులైన్‌లు ప్రారంభంలోను, ట్యాప్ వద్ద నీటి నాణ్యత తప్పనిసరిగా పరీక్షలు చేయాలి. ప్రతి పీహెచ్‌సీలోనూ, హెల్త్ సెంటర్‌లోను ఓఆర్‌ఎస్ జింక్ కార్నర్ ఏర్పాటు చేసుకోవాలి. ఓఆర్‌ఎస్ స్టాక్‌ను పూర్తిస్థాయిలో ఉంచుకోవాలి. అదేవిధంగా సూపర్‌వైజర్లు, హెల్త్ ఎడ్యుకేటర్స్, ఎంపీహెచ్‌ఈవోలతో అవగాహన సదస్సులు నిర్వహించాలని, మంచినీటి ట్యాంకులను పరిశుభ్రం చేసిన లాగ్ బుక్‌లో క్లోరినేషన్ రీడింగ్‌ను తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

అతిసార వ్యాధి లక్షణాలు ఇలా..

పిల్లలు ఒకరోజు మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు విరోచనం పల్చగా ఉన్నట్టయితే దానిని అతిసార వ్యాధిగా గుర్తించాలి. చిన్నపిల్లలు తల్లి పాలు తాగకపోవడం, తక్కువగా తాగడం, ప్రతీది వాంతి చేసుకుంటూ ఉంటే, తరచుగా మలవిసర్జన పలచగా వెళ్లడం వల్ల తీవ్రమైన నీరసం రావడం, మలంతోపాటుగా రక్తం పడడం, ఆసక్తిలేకుండా ఉండడం, అపస్మారకస్థితిగా ఉండడం, జ్వరంగా ఉండడం, శరీరం తాకితే చల్లగా అనిపించడం, వేగంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడడం, అరచేతులు, అరికాళ్ళు పసుపుచ్చగా మారడం, మూర్ఛ, ఫిట్స్‌వంటి రావడం జరగుతాయి. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- నివారణ కోసం విటమిన్-ఎ సిరప్ తాగించాలి, స్వచ్ఛమైన తాగునీటిని ఉపయోగించాలి. భోజనానికి ముందు, మరుగుదొడ్డి ఉపయోగంచిన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. బిడ్డలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. రోటావైరస్, తట్టుకు టీకాలు వేయించాలి.

పోస్టర్లతో అవగాహన కార్యక్రమాలు

పట్టణాల్లోనూ, గ్రామీణ ప్రాంతాలల్లోనూ అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం పోస్టర్లను కూడా జిల్లా వైద్యశాఖ విడుదల చేసింది. గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

డాక్టర్లకు, సిబ్బందికి శిక్షణ తరగతులు

జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో డాక్టర్లకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. వ్యాధి సంక్రమిస్తే ఎటువంటి చర్యలుతీసుకోవాలి, చిన్న పిల్లలకు వస్తే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే దానిపై శిక్షణ ఇస్తున్నారు. మండల స్థాయిలో ఏఎన్‌ఎంలకు, ఏపీహెచ్‌ఎల్స్‌కు, మునిసిపాల్టీలో సచివాలయంలోని హెల్త్ సెక్రటరీలకు అవగాహన కల్పిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా..

వేడి ఆహారం తీసుకోవాలి, కాచివడగట్టిన నీటిని తీసుకోవాలి. నిల్వ ఉన్న ఆహారం తినకుండా చూడడం, కలుషిత నీరు తాగకుండా ఉండడం, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం తదితర అంశాలను పాటిస్తే ఈ వ్యాధిని నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపు కీలకం

» ఉద్యానవర్సిటీ ఉప కులపతి డాక్టర్ జానకీరామ్


కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వీసీ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 26 : విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుదల అత్యంత కీలకమని నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడిని అధిగమించడం, సమ య పాలన, సృజనా త్మకత అవసరమని ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం 17వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం వర్సిటీ ప్రాంగణంలో జాతీయ అకాడమి ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ ద్వారా కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వారా కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం, ఎంటర్‌ప్రన్యూర్‌షిప్, ఇన్నోవేషన్, పూర్వవిద్యార్థుల కో-ఆర్డినేషన్, ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేషన్, ఐడియా ఫిట్టింగ్ ప్రోగ్రాంలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ సలోమి సునీత, కళాశాల డీన్ ఎం మాధవి, డీన్ ఆఫ్ హార్టికల్చర్ ఏఎస్ పద్మావతమ్మ, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఎస్. సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు వెంకాయమ్మ మృతి


వెంకాయమ్మ (ఫైల్)

పెనుమంట్ర, జూన్ 26 : మార్టేరుకు చెందిన దివంగత అడబాల సాంబమూర్తి భార్య అడబాల వెంకాయమ్మ(109) మృతి చెందారు. వడలి గ్రామానికి చెందిన ఆమె 1915లో జన్మించారు. భర్త ఉద్యోగరీత్యా వడలి గ్రామం నుంచి వచ్చి మార్టేరులో స్థిరపడ్డారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను, ఆటుపోట్లని ఎదుర్కొన్నారు. ఆమెకు వయసు రీత్యా తప్ప ఎటువంటి దీర్ఘకాలిక ఇబ్బందులు లేకుండా జీవించడం గమనార్హం. ఆమెకు 17 మంది మనుమలు, 32 మంది ముని మనములు, ఆరుగురు అనుమనుమలుతో కలిపి మొత్తం 60 మంది కుటుంబసభ్యులు ఉన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

జీలుగుమిల్లి, జూన్ 26 : లక్ష్మీపురం సమీప పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం గ్రామ పొలాల్లో పేకాటాడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసి వారి వద్ద నుంచి రూ. 6,900 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.



కొత్తగా జారీచేసే ధ్రువపత్రంపై జగన్ చిత్రం స్థానంలో రాజముద్ర
గతంలో జారీచేసిన ధ్రువపత్రాలపై వున్న జగన్ చిత్రం

ఇక ధ్రువ పత్రాలపై రాజముద్ర

ఏలూరు రూరల్, జూన్ 26 : వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని కార్యాలయాల్లో జారీచేసే ధ్రువపత్రాలపై కన్పించిన నాటి సీఎం జగన్ చిత్రపటం ప్రస్తుతం కనుమరుగైంది. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో సచివాలయాల్లో జారీచేసే ధ్రువపత్రాలపై జగన్ బొమ్మను తొలగించి రాజముద్ర ఉన్న హైసెక్యూరిటీ ఫారాలు సచివాలయాలకు అందాయి. వైసీపీ పాలనలో జగన్ బొమ్మ వున్న హైసెక్యూరిటీ పత్రాలను నిలిపివేసి రాజముద్రతో ఉన్న ఫారాలను ప్రభుత్వం సచివాలయాలకు అందజేసింది. ఇకపై రాజముద్ర ఉన్న ధ్రువపత్రాలనే ప్రజలకు అందజేస్తారు.

పాత వెబ్‌ల్యాండ్‌ను పునరుద్ధరించాలి

ఏలూరు రూరల్, జూన్ 26 :రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీఎం, జాయింట్ ఎల్‌పీఈఎం వల్ల రైతులకు సంబంధించిన క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమస్యల దృష్ట్యా పాత వెబ్‌ల్యాండ్‌ను పునరుద్ధరించాలని ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు రీసర్వేపై అసంతృప్తిగా ఉన్నందున రీసర్వే రద్దు చేయాలని సీఎం చంద్రబాబునాయుడికి విజ్ఞప్తి చేశామన్నారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో ఎక్కువశాతం మంది ఉద్యోగులు లేనందున స్పెషల్ చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ, సీసీఎల్‌ఏ, అడిషనల్ సీసీఎల్‌ఏ సెక్రటరీ, రెవెన్యూ సిబ్బందిని ప్రక్షాళన చేసి మంచి అధికారులను నియమించాలని కోరారు. రెవెన్యూ శాఖలో అనేక సమస్యలు కొంతకాలంగా పెండింగ్‌లో ఉండడం వల్ల సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారని, ఆయాశాఖల్లో అధికారులను నియమించాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

30న పోలవరానికి విదేశీ నిపుణుల బృందం రాక

పోలవరం, జూన్ 26 : పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు విదేశీ నిపుణుల బృందం ఈనెల 30న వస్తున్నారని, పరిశీలన కార్యక్రమాల్లో పాల్గొంటారని పోలవరం ప్రాజెక్టు ఈఈ మల్లికార్జునరావు బుధవారం తెలిపారు. ఈనెల 29వ రాత్రికి పోలవరం ప్రాజెక్టుకి ఈ బృందం చేరుకుని ప్రాజెక్టు అతిథి గృహంలో బస చేస్తారని, 30 ఉదయం నుంచి పోలవరం ప్రాజెక్టులో ఎగువ, దిగువ కాపర్ డ్యాంలు, డయాఫ్రంవాల్ ప్రాంతాలను ఇతర ప్రాంతాలను పరిశీలిస్తారని తెలిపారు. ఈనెల 27న ఈ బృందం పోలవరం రావాల్సి ఉండగా పలు కారణాల వల్ల తేదీలు మారినట్టు ఈఈ తెలిపారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

భీమవరం క్రైం, జూన్ 26 : తాను సహజీవనం చేస్తున్న మహిళ ఇంటి నుంచి వెళ్ళిపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భీమవరం రూరల్ హెచ్‌సీ మహేశ్వరరావు తెలిపిన వివరాలివి.. కృష్ణా జిల్లా గుడివాడ మండలం మందపాడు గ్రామానికి చెందిన వెలగలేటి సుబ్బారావు(42)కు రేణుకతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఐదేళ్ళ క్రితం మరో మహిళతో సహజీవనం చేస్తూ భీమవరం మండలం దొంగపిండి గ్రామంలోని ఒక రైతు చెరువుపై చేరాడు. అక్కడే వారిద్దరూ ఉండేవారు. సహజీవనం చేస్తున్న మహిళ మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోవడంతో సాయంత్రం చేపల చెరువులో వాడే పురుగుమందును తాగి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. భీమవరం ఆసుపత్రికి తీసుకురాగా అతడు మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

మోటారు ఆన్‌చేస్తూ.. గ్రీన్ అంబాసిడర్ మృతి


మృతి చెందిన చంద్రపాల్

నరసాపురం రూరల్, జూన్ 26: కొప్పర్రు గ్రామంలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న చంద్రపాల్(55) బుధవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. తాగునీటి సరఫరా సమయంలో రేకుల షెడ్‌లో ఉన్న మోటారు ఆన్ చేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు, పంచాయతీ చెరువుకు సంబంధించిన షెడ్‌కు సరైన రక్షణ లేకపోవడం వల్లే మృతి చెందాడని స్థానికులు పేర్కొంటున్నారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. అతడి మృతదేహాన్ని ఎంపీడీవో రమణారావు, ఈవోపీఆర్డీ శర్మ, సర్పంచ్ నల్లి వరలక్ష్మి సందర్శించి సంతాపం తెలిపారు.

సరిహద్దు వివాదం.. ఇరువర్గాల ఘర్షణ

లింగపాలెం, జూన్ 26: లింగపాలెం మండలం, లింగపాలెంలో భూమి సరిహద్దు విషయంలో ఇరువర్గాల ఘర్షణ పడి దాడులు చేసుకున్న ఘటన జరిగింది. ధర్మాజీగూడెం ఎస్‌ఐ పి.చెన్నారావు తెలిపిన వివరాలివి.. లింగపాలెం గ్రామానికి చెందిన కోటగిరి శ్రీకాంత్, కోటగిరి రవీంద్ర, కోటగిరి శ్రీనివాస్ తమ భూమిసరిహద్దుల విషయమై గొడవపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పరస్పరం కేసులు పెట్టుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెచ్చిపోతున్న గంజాయి మూకలు !

» గడ్డి వాములు దహనమే పరిపాటి » పాకల్లో కాలిపోతున్న పశువులు


వరధనంలో కాలిపోయిన గేదెలు(ఫైల్)

పాలకొల్లు రూరల్, జూన్ 26 : పాలకొల్లు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గంజాయి మూకలు రెచ్చిపోతున్నాయి. గడ్డి వాము కనిపిస్తే చాలు అంటించి వేయడమే పనిగా పెట్టుకున్నారు. వారం రోజుల క్రితం గొల్లవానిచెరువు, నాగరాజు పేటల్లో రెండు వేర్వేరు ప్రాంతాల్లో పది ఎకరాల గడ్డి వాములను గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ ఘటన మరువక ముందే యలమంచిలి మండలం కాజ గ్రామంలో రెండు గడ్డి వాములను దగ్ధం చేశారు. ఈ ఘటనలో మూడు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. పాలకొల్లు మండలం వరధనం గ్రామంలో డొమ్మేటి నాగేశ్వరరావుకు చెందిన పాకను దగ్ధం చేయడంతో మూడు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్న వారు గంజాయికి అలవాటు పడినవారే చేస్తున్నారని పాడి రైతులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు తమకు ఫిర్యాదు అందలేదని ఏవిధమైన దర్యాప్తు చేపట్టకపోవడంతో గంజాయి మూకలు మరింత రెచ్చిపోతున్నాయి. ఈ ఘటనలను పోలీసులు సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసి నిందితులను పట్టుకుని శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

» చర్మం కాలి తీవ్రంగా గాయపడిన మూడు గేదెలు


కాజపడమరలో కాలిన గేదెలపాక, గడ్డివాము
ఒళ్లంతా కాలిన గేదెలు

యలమంచిలి, జూన్ 26: కాజ పడమర గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గుబ్బల కృపారావుకు చెందిన గడ్డివాము దగ్ధం కావడంతోపాటు పక్కన ఉన్న గేదెల పాక పూర్తిగా కాలిపోవడంతో పాకలో ఉన్న మూడు గేదెలకు చర్మం తీవ్రంగా కాలిపోయింది. వీటిలో ఒకటి పాడిగేదె కాగా మిగిలినవి చూడి గేదెలు. పాడి గేదె దాదాపు 90శాతం ఒళ్లు కాలిపోయి పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన రెండు గేదెలు దాదాపు 50శాతం ఒళ్లు కాలి తీవ్రంగా గాయాలపాలయ్యాయి. మరో రైతు కడలి వేణుకు చెందిన గడ్డివాము పూర్తిగా తగలబడింది. ఈ సంఘటన రైతులు, స్థానికులకు సుమారు మూడు గంటల సమయంలో తెలియడంతో ఘటనాస్థలానికి చేరుకునేసరికే నష్టం జరిగిపోయింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. పశువైద్యాధికారులు గాయపడిన గేదెలకు చికిత్స అందిస్తున్నారు. పాలు అమ్ముకుని జీవనం సాగించే గుబ్బల కృపారావు మూడు గేదెలు కాలి తీవ్రంగా గాయాలపాలవడంతో జీవనోపాధి కోల్పోయాడు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఆగంతకులు గడ్డివాములకు నిప్పంటించారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

రోడ్లపై మురుగు నీరు కనిపిస్తే చర్యలు


డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం టౌన్, జూన్ 26: పట్టణంలో ఎక్కడైన రోడ్లపై మురికి నీరు కనిపిస్తే చర్యలు తీసుకుం టామని ఎమ్మెల్యే నాయకర్ హెచ్చ రించారు. స్టీమర్ రోడ్‌లోని టేలర్ హైస్కూల్ వద్ద రోడ్లపై వచ్చిన మురికి నీటిని బుధవారం పరిశీ లించారు. ఇలా ఉంటే విద్యార్థు లు వ్యాధులు బారిన పడే ప్రమాదముందన్నారు. ఎక్కడ చెత్త, చెదారం, మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కూటమి నాయకులు ఉన్నారు.

మంచి పాలన అందించడమే కూటమి లక్ష్యం

నరసాపురం : మంచి పాలన అందించాలన్నదే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. పట్టణంలోని అంకానివారిపాలెంలో జరిగిన సమావేశంలో నాయకర్ మాట్లాడుతూ ఓటమి తరువాత వైసీపీ నాయకుల్లో మార్పు వస్తుందనుకున్నాం అదేక్కడ కనిపించడం లేదన్నారు. అయితే కూటమి శ్రేణులకి ఇబ్బందులు కలిగిస్తే చూసు ఊరుకోంమంటూ మండిపడ్డారు. దీంతో యువత కేరింతలు కొట్టారు.

పవన్, లోకేష్‌లను కలిసిన మంత్రి నిమ్మల


పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జూన్, 26: వెలగపూడి సచివాల యంలో డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌లను బుధవారం ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు వారివారి చాంబర్లలో కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. అనం తరం ఇరువురుతో మంత్రి నిమ్మల పోలవరం ప్రాజెక్ట్, ఇతర అంశాలపై మాట్లాడినట్లు ఆఫీసు వర్గాలు వెల్లడించాయి.

మంత్రి లోకేశ్‌ను కలసిన బాబ్జి


మంత్రి లోకేశ్‌ను సత్కరిస్తున్న బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 26: మంత్రి లోకేశ్‌ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి విజయవాడలో బుధవారం మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భం గా లోకేశ్ కూటమి విజయంపై పార్టీ శ్రేణుల కృషిని ప్రశంసిం చారు. కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం లోకేశ్‌ను బాబ్జి సత్కరించారు.

ప్రతిపక్ష హోదా అడిగే అర్హత లేదు

వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా అడిగే అర్హత లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలోటీడీపీకి ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తానన్న జగన్ ఇప్పుడు తనకు ప్రతిపక్ష హోదా కావాలంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు లేఖ రాయ డం విడ్డూరంగా ఉందన్నారు. గొర్రెల శ్రీధర్, వాడపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

11 సీట్లకే జగన్‌ను పరిమితం చేశారు


ఎమ్మెల్యే శ్రీనివాస్

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 26: వైనాట్ 175 అంటూ ప్రగల్భాలు పలికి న వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం లో విలేకరులతో మాట్లాడుతూ గతంలో తాను తలుచు కుంటే టీడీపీకి ప్రతి పక్ష హోదా లేకుండా చేస్తానని జగన్ విర్రవీగారన్నారు. ఇప్పుడు ప్రతిపక్ష హోదా ఎలా అడుగుతున్నా రంటూ ప్రశ్నించారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి: ఆరిమిల్లి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జూన్ 26: పట్టణంలో పారిశుధ్య చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు. మున్సిపల్ కార్యాల యంలో అధికా రులతో బుధవారం సమీక్షా సమా వేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకో వాలన్నారు. అనం తరం డయేరియా నివారణపై కరపత్రాలను ఆవిష్కరించారు. కమిషనర్ బీవీ రమణ, టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, పరిమి వెంకన్న బాబు, కలగర వెంకట కృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అంజిబాబుకు ఆహ్వానం

భీమవరం టౌన్, జూన్ 26 : మావుళ్ళమ్మ జ్యేష్ఠమాస జాతరలో పాల్గొన్నాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనే యులు (అంజిబాబు)ను బుధవారం ఆయన ఇంటికి వెళ్లి దేవస్థానం సహాయ కమిషనర్ ముద్ద మహాలక్ష్మి, నగేష్ ఆహ్వానించారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ, అర్చకులు ఆశీర్వచనాలు అంజేసి, అమ్మవారి ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని అందించారు.

రాజీ పడదగిన కేసులకు పరిష్కారం

మొగల్తూరు, జూన్ 26 : అన్ని రకాల రాజీ పడదగిన సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో ఇరు పార్టీల అంగీకారంతో సత్వర పరిష్కారం పొందవచ్చని పారా లీగల్ వలంటీర్ నాగిడి రాంబాబు అన్నారు. జాతీయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న నరసాపురంలోని అన్ని కోర్టుల్లోనూ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలియచేసే పత్రాలను రాంబాబు ముత్యాలపల్లిలో బుధవారం అధికారులు, ప్రజలకు అందించారు. గ్రామ కార్యదర్శి సీతా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

హంతకుల్ని కఠినంగా శిక్షించాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నరసాపురం, జూన్ 26: బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపురుపాలెం గ్రామంలో ఓ యువతిపై జరిగిన అమానుష సంఘటనను ఖండిస్తూ బుధ వారం నరసాపురం వీవర్స్ ఫంట్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. బాధితురాలు కుటుంబానికి న్యాయం చేసి నింధితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. రాత్రి అంబేడ్కర్ సెంటర్‌లో కొవ్వత్తుల ప్రదర్శన చేశారు జిల్లా కన్వీనర్ కనకం ప్రసాద్, ఒగ్గు సత్యనారాయణ, బుడిద జోగేశ్వరరావు, ఎస్ శివప్రసాద్, వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, ఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు అందించాలి

పాలకొల్లు రూరల్, జూన్ 26: పుట్టిన ప్రతీ బిడ్డకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.ఉమామహేశ్వరరావు సూచిం చారు. లంకలకోడేరు ఒకటో సచివాలయ పరిధిలో బుధవా రం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమామహేశ్వ రరావు మాట్లాడుతూ ఈ టీకాలు వల్లకలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు తెలపాలన్నారు. డాక్టర్ ఎం.నవ్య జీవన్, ఆరోగ్యవిస్తరణాధికారి గుడాల హరిబాబు, సిబ్బంది ఎలిజిబె త్, అమలేశ్వరరావు, ఆదిలక్ష్మీ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

నరసాపురం, జూన్ 26: రాజకీయాల్లో గెలుపు ఓటమిలు సహజమని మీకు ఏ కష్టం వచ్చినా నేను, పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు వైసీపీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. ఓటమి తరువాత పార్టీ శ్రేణులతో బుధవారం రాత్రి నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దీనికి కొంత మంది ముఖ్య నాయకులు మాత్రమే విచ్చేశారు.

మత్తుతో జీవితాలు చిత్తు

ఎమ్మెల్యేలు అంజిబాబు, రఘురామ


భీమవరంలో బ్రోచర్‌ను అవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూన్ 26 : మత్తు పదార్థాల వలన జీవితం నాశనమవుతుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు (అంజిబాబు) అన్నారు. శ్రీవిజ్ఞా న వేదిక ఆధ్వర్యంలో కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాల విద్యార్థులతో బుధవారం ఎమ్మెల్యే అంజిబాబు కార్యా లయంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించి వారోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి కేజీఆర్ఎల్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహిం చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాఘవ, చెరుకు వాడ రంగసాయి, కోళ్ల నాగేశ్వరరావు, నల్లం చిట్టిబా బు, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సాయి ఫణీంద్ర, ఉమా మహేశ్వరి, మోహన్ రూపా పాల్గొన్నారు.

- ఆకివీడు : మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్స వం సందర్భంగా నవజీవన బాల భవన్‌కు చెందిన లీలావతి ప్రచారంలో భాగంగా గుమ్ములూరులో ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. చంద్రబాబు గంజాయిపై ఉ క్కుపాదం మోపుతున్నారన్నారు. ఈయన వెంట కూటమి శ్రేణులు ఉన్నారు.
- పెంటపాడు : మాదక ద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు ప్రేమ్‌సాగర్, విజయ్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.
- తణుకు : మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితాలను సుఖమయం చేసుకోవాలని డాక్టర్ కె.ఆనంద్ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ చదువుకునే వయస్సు నుంచే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితం నాశనం చేసుకుంటున్నారు. న్యాయ వాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, ముప్పిడి సుబ్బయ్య, సత్యనారాయణ రాజు, అజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్ ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజ రాజేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రాజ రాజేశ్వరి అధ్యక్షత వహించి మాట్లాడారు. పాలకొల్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, కళాశాల సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్ఈబీ సీఐ ఎస్‌కే భవానీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మాదక ద్రవ్య వ్యతిరేక కమిటీ కో కన్వీనర్ వంశీ, రసాయన శాస్త్ర విభాగం హెడ్ డాక్టర్ వి.యమిని, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కె.భద్రాచలం, ఎస్ఎస్ఎస్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : యువత మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి నిండు జీవితాలను నాశనం చేసుకుంటారని ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ మద్దాల శ్రీనివాసరావు అన్నారు. మాదక దవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా పట్టణంలోని ఆదిత్యా కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి అనంతరం ర్యాలీ నిర్వహించారు.

పేదల కడుపు నిండుతుంది


అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు

ఆకివీడు, జూన్ 26: ఆకలన్న వాడికి అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను తొలగించిన ఘనత మాజీ సీఎం జగన్‌దేనని ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు అన్నారు. స్థానిక గాంధీజీ సెంటర్‌లో దాతలు సహకారంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నం వడ్డించి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చే సిన అన్న క్యాంటీన్లను జగన్ తొలగించాడన్నారు. అయి-భీమవరంలో బుధవారం ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక తెల్లవంతెన దగ్గర,అయి-భీమవరం, పెదకాపవరంలోని వెంకయ్య వయ్యేరు కాలు వను ఎమ్మెల్యే కనుమూరి పరిశీలించారు. తూడు తొలగింపునకు ప్రభుత్వ నిధు లతో పాటు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పంట, మురుగు బోదెలు అభివృద్ధికి ఎమ్మెల్యే చేపట్టిన స్వచ్ఛంద సహాయ నిధికి జనసేన రాష్ట్రనేత తోట వాసు బుధవారం రూ.25 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు, టీడీపీ మండల,పట్టణ కార్యదర్శులు నౌకట్ల రామారావు, గంధం ఉమా, మోటుపల్లి సత్యనారాయణ, జుత్తిగ నాగరాజు, ఎండీ అజ్మల్, జాకీర్, జుత్తిగ నాగరాజు, కను మూరి కృష్ణంరాజు, ఇరిగేషన్ డీఈ మూర్తి, తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరీ, ఏఈ రాము తదితరులు ఉన్నారు.

డ్రెయిన్లు, కాలువల ప్రక్షాళనే ధ్యేయం

ఉండి : డ్రెయిన్లు, పంటకాల్వలను ప్రక్షాలన చేయడమే తమ ధ్యేయమని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణం రాజు అన్నారు. ప్రజలు, రైతుల భాగస్వామ్యంతో తాను నియోజకవర్గంలో తీసుకువచ్చిన పార్వ్యల కు మంచి స్పందన వచ్చిందని వెల్లడించారు. వాంద్రంలో బొండాడ డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను బుధవారం ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వ మొత్తం గుల్ల చేసుకుని వెళ్ళిపోయిందంటూ విమర్శించారు. తాను అనుకున్న పనులను స్వచ్ఛందంగా పూర్తి చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నాని రైతులు రూ.వెయ్యి నుంచి వారి స్తోమతను బట్టి విరాళాలుగా ఇవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే సోదరుడు నర్సింహరాజు ఇప్పటికే కాళ్ళ మండలంలో డ్రెయిన్ పనులు చేయిస్తున్నారని అభినందించారు. అనంతరం కాళ్ళ మండలంలో అన్నయ్యకోడు, వెంకయ్య ఒయ్యేరు కాలువలను ఎమ్మెల్యే రఘురామ పరిశీలించారు. పంట కాలువలో జరుగుతున్న పనులను చూసి పలు సూచనలు చేశారు. నియోజకవర్గ జనసేన ఇంచార్జి జుత్తుక నాగరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, కరిమెరక నాగరాజు, కన్నెగంటి రూత్‌కళ, గవర లక్ష్మి, సర్పంచ్ జాన్, మండల టీడీపీ అధ్యక్షుడు గుండాబత్తుల నాగేశ్వరరావు , భూపతిరాజు జగ్గరాజు, మంతెన నర్సింహమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు మూసి వేస్తే ఉపాధి కష్టం


సెమినార్‌లో మాట్లాడుతున్న సీతారాం

భీమవరం అర్బన్, జూన్ 26 : పరిశ్రమల మూసి వేత వల్ల ఉపాధి భద్రత అనేది లేకుండా పోయిందని, పాలకులు అభివృద్ధిని సంక్షేమాన్ని ఓట్లతో కొలుస్తున్నారని పథకాలన్నీ ఓట్ల పథకాలుగా మార్చేస్తున్నారని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింహరావు ఆవేదన వ్యక్తం చేశారు. త్యాగరాజ భవన్‌లో బుధవారం జిల్లా అధ్యక్షులు జేఎన్వీ గోపాలన్ అధ్యక్షతన రాష్ట్ర సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు అమరజీవి పరస సత్యనా రాయణ చిననతనం నుంచి పీడిత ప్రజల పక్షాన నిలబడిన పోరాడిని యో ధుడన్నారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ నాయకులు మంతెన సీతారాం, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రాము, పరస సత్యనారాయణ కుమార్తే లీల, పర్స సత్యనారాయణ జీవిత విశేషా లను ప్రజల కోసం ఆయన చేసిన ఉద్యమాలను తెలియజేశారు. సీఐటీయూ నేతలు కె.రాజారామ్మోహన్‌రాయ్, రైతు సంఘం నాయకులు బలరాం, చింతకా యల బాబురావు, బి.వాసుదేవరావు, నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి

గణపవరం, జూన్ 26 :భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ విజ్ఞప్తి చేశారు. గణపవరం సంఘ కార్యాలయంలో బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను దారి మళ్లిం చిందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు గోవర్ధనరావు, జిల్లా కోశాధికారి ఏడిద వాసు, గణపవరం సంఘం గౌరవ అధ్యక్షుడు తోట సత్యనారాయణ, అధ్యక్షుడు నారాయణరావు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం


బ్యాంకు ఆఫ్ బరోడా శాఖను ప్రారంభిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

ఆకివీడు, జూన్ 26: అంతర్జాతీయ ప్రభు త్వరంగ బ్యాంకులలో అత్యధిక సంఖ్యలో శా ఖలు ఉన్నది బ్యాం కు ఆఫ్ బరోడా అని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక వెలంపేట లోని పద్మావతి నర్సింగ్ హోమ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 47వ బ్యాంకు ఆఫ్ బరోడా శాఖను బుధవారం ఆయన ప్రారంభించారు. హైదరాబాద్ జోన్ జీఎం, జోనల్ మేనేజరు రితేశ్‌కుమార్, రీజినల్ మేనేజర్ చందన్‌సహు మాట్లా డుతూ బ్యాంకు ఆఫ్ బరోడా తెలుగు రాష్ట్రాల్లో 400 పైగా శాఖలతో రూ.లక్షల కోట్ల వ్యాపారం నిర్వహిస్తోందన్నారు. ఆక్వా, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి బ్యాంకు సేవలందిస్తుందన్నారు. నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ వంగా జోత్స్న, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించుకోవాలి

పెనుగొండ, జూన్ 26 : గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ముందుండాలని కూటమి నాయకుడు ఉప్పలపాటి చంటి అన్నారు. వడలిలో కూటమి పార్టీ కార్యాలయంలో బుధవారం సభ్యుల తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌డీఏ కూటమి పార్టీల నాయకులు పలు సమస్యలు లేవనెత్తగా తీర్మానించారు.

ఆసుపత్రుల్లో పని తీరు మారాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పితాని

పోడూరు, జూన్, 26: ప్రభుత్వ ఆసుపత్రుల పని తీరు మారాలని రోగులను ఆదరించి వైద్య సేవలందించాల ని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించా రు. గర్భిణులకు అవసరమైతే తప్ప సిజేరియన్ వద్దని నార్మల్ డెలివరీలు కావాల న్నారు. పోడూరు మండలం కొమ్ముచిక్కాలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజ కవర్గంలోని పీహెచ్‌సీలకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ అధికా రులతో సమీక్షించారు. ఆసుపత్రిల్లో వైద్య బృందం అందుబాటులో ఉండి ఓపీతో పాటు ప్రసవాలు సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. పోడూరు పరిధిలోని గుమ్మలూరు పీహెచ్‌సీ మంజూరైం దని స్థలం లేక నిర్మాణం జరగలేదని అధికారులు ఎమ్మెల్యే పితాని దృష్టికి తీసుకొ చ్చారు. దీంతో ఆయన స్పందించి సొంత భవనం నిర్మించే వరకు అద్దె భవనంలో వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా డీఎంహెచ్‌వో మహేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పితానికి అభినందనలు

పెనుగొండ, జూన్ 26 :పెనుగొండ, చెరు కువాడ బ్రాహ్మణ సమాఖ్య సంఘం త రుపున పలువురు సభ్యులు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ను బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు మొక్కరాల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి శిష్టా మణికంఠ శర్మ, ఉపాధ్యాక్షుడు అడవి రామభద్రం, సహాయ కార్యదర్శి కాశీభట్ల పణి,సహాయ కార్యదర్శి ముదుంబై బుజ్జి, అడవి శేకర్, పిన్నంరాజు రామకృష్ణ తదిత రులున్నార

ముందస్తు చర్యలు తప్పనిసరి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 26: వర్షా కాలంలో డయేరియా రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ పేర్కొన్నారు. మండలం లోని కృష్ణాయపాలెం, నందమూరు, ఆరుళ్ల, నవాబుపాలెం గ్రామాల్లో డయేరియా క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు పరిశీలించి మంచినీటి పరీక్షలు ఎలా చేస్తున్నారో సమీక్షించారు. పారిశుధ్యంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు బేతపూడి సుబ్బలక్ష్మి, శనగన వరలక్ష్మి, మద్దుకూరి గంగాభవాని, ఈవోపీఆర్డీ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి నీటి ట్యాంకుల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

నరసాపురం రూరల్, జూన్ 26: సబ్‌డివిజన్ పరిధిలోని పది మండలాల్లో మంచి నీటి ట్యాంకుల క్లీనింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు డీఎల్‌పీవో శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 225 వరకు ఓహెచ్ఆర్ ట్యాంకర్లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున్న క్లోరినేషన్ చేసిన తరువాతే తాగునీరు సరఫరా చేయాలన్నారు.

వచ్చే నెల మొదటి వారంలో టూల్ కిట్స్ అందజేత

భీమవరం టౌన్, జూన్ 26 : ప్రధానమంత్రి విశ్వకర్మ ప్రోగ్రాంలో శిక్షణ పొందిన వారికి వచ్చే నెల మొదటి వారంలో టూల్ కిట్స్ అందజేస్తామని ఆర్‌డీఎస్ డీఈ సౌత్ రీజనల్ డైరక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. విశ్వకర్మ ప్రోగ్రాంలో భాగంగా రాఘ వేంద్ర ఐటీఐలో టెక్నాలజీస్ సంస్థ ద్వారా 800 మందికి శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం జరిగిన సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. ఆర్‌డీ ఎస్‌డీఈ జేడీ శాంతి, డిప్యూటీ డైరెక్టర్ చంద్రమౌళి, ప్రశాంత్, కృష్ణరెడ్డి, ముసులూరి సునీల్, ఉద్దరాజు వేణుగోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోడూరులో చిరు జల్లులు

పోడూరు, జూన్, 26 : గ్రామంలో బుధవారం చిరు జల్లులు కురిశాయి. ఉదయం నుంచీ ఎండ తీవ్రతగా ఉండటంతో తేలికపాటి చిరుజల్లులుతో కాసేపు వాతావరణం చల్లబడినప్పటికీ తర్వాత వేడి ఉక్కపోత మొదలైంది. ఏకధాటిగా వర్షం కురిస్తే గానీ వేడి తగ్గదని ప్రజలు భావిస్తున్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, కిట్ల అందజేత


పాలకొల్లులో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న నారాయణ మూర్తి తదితరులు

పాలకొల్లు అర్బన్, జూన్ 26 : స్థానిక బ్రాడీపేటలోని ఏఎస్ మున్సిపల్ హైస్కూల్లో, వీవర్స్ కాలనీలోని జీవీఎస్వీ మున్సిపల్ స్కూల్లో, 31వ వార్డులోగల మున్సిపల్ ఎలిమెంట్రీ స్కూళ్లలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యా సమగికన కిట్లను బుధవారం అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ వల్లభ నారాయణ మూర్తి, టీడీపీ వార్డు ఇంచార్జి ధనాని సూర్య ప్రకాష్, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర సభ్యులు బొంతు వెంకట తిరుమలరావు, నాయకులు జీవీ సుబ్బారావు, మీసాల రాము, నారాయణ రావు, ఎం.పద్మజ, సబ్బితి వెంకట రెడ్డి, కిలారి రామారావు, పోతుల ఉమాశంకరరావు, మజ్జి అప్పలనాయుడు,బి రాజేష్, నరేంద్ర, దనాని ప్రకాష్, మజ్జి శంకరం, జనసేన నాయకులు శిడగం సూరి, విన్నకోట గోపి, హెచ్ఎంలు ఆర్ విష్ణుమూర్తి, ఆర్ భవానీ ప్రసాద్, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- పోడూరు : వేడంగి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం కిట్లును పంపిణీ చేశారు. బీజేపీ పాలకొల్లు నియోజకవర్గ ఇంచార్జి యర్రంశెట్టి పద్మారావు, సర్పంచ్ చెల్లుబోయిన పద్మశారద అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ యర్రంశెట్టి నరసింహరావు, నాయకులు బొలిశెట్టి విశ్వేశ్వరరావు, కొండేటి ప్రసాదు, మంగయ్య నాయుడు, సుభాష్‌చంద్రబోస్, హెచ్ఎం పెచ్చెట్టి పెద్దిరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- మొగల్తూరు : కాళీపట్నం పడమరలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు కవురు సీతామహలక్ష్మీ, సర్పంచ్ కవురు సావిత్ర ఆదినారాయణ, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు, జూన్ 26: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి గురువారం రాజానగరం ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్ మెడిసిన్, కాన్సర్, స్త్రీల సంబంధ వ్యాధులు, చిన్నపిల్లలు, గుండె సంబంధ వైద్యనిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందిస్తార న్నారు. అవసరమైన వారికి అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్ పరిక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

పెంటపాడు, జూన్ 26: ప్రత్తిపాడు వై.జంక్షన్ వద్ద గల దుర్గమ్మ ఆలయంలో బుధవారం హుండీ లెక్కించారు. మూడు నెలలకుగాను రూ.4,61,606లు లభించి నట్టు ఈవో ఎం.శ్రీదేవి తెలిపారు. అర్చకుడు కొత్తలంక శివసత్యనారాయణ, కూటమి నాయకులు చెరుకూరి జగత్ సోమశేఖర్, ముప్పిడి రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

గొడవలు పడవద్దు

పాలకోడేరు, జూన్ 26: గ్రామాల్లో ఎటువంటి గొడవలకు తావులేకుండా ప్రతీ ఒక్కరు సామరస్యంగా ఉండాలని పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు అన్నారు. గొల్లలకోడేరు, వేంద్ర గ్రామాల్లో బుధవారం శాంతి కమిటీ సమావేశాన్ని గ్రామ నాయకులు ప్రజల సమక్షంలో రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఎస్ఐ నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు కక్షలను పెంచుకోవద్దని సూచించారు. ఎటువంటి గొడవలు జరిగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు.

విద్యార్థులకు స్టేషనరి సామగ్రి అందజేత

ఆచంట, జూన్ 26 : ఇంటర్‌నేషనల్ వాసవీ క్లబ్ ఆదేశాల మేరకు బుధవారం కొడమంచిలి ఆర్యవైశ్య సేవా సంఘం భవనంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరి కిట్స్, బ్లైండ్ స్టిక్స్ అందజేశారు. ఇంటర్‌నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దర్శి శ్రీనివాస గుప్త, రీజనల్ చైర్మన్ వీవీఎస్ రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం నే తలు, మహిళలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జర భద్రం

నరసాపురం టౌన్, జూన్ 26: సీజనల్ వ్యాధులతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ వెంకటేశ్వరావు ఆదేశించారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, తదితర వ్యాధులపై వైద్య, ఆరోగ్య, పురపాలక సిబ్బందితో బుధవారం సమీక్షించారు. డ్రెయినేజీలలో నీరు నిల్వ లేకుండా చూడాలని, పైప్‌లైన్లు లీకేజీలను అరికట్టాలని, వాటర్ శాంపిల్స్ తీసి పరీక్షలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైన జ్వారాలు వస్తే వైద్య సిబ్బంది తక్షణం స్పందించి క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు.

తల్లిదండ్రులకు అవగాహన కల్పించండి

పెనుగొండ, జూన్ 26 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేలా ఉపాధ్యాయులు, హెచ్ఎంలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంఈవో డి.శుభాకరరావు అన్నారు. పెనుగొండ ఎంఈవో కార్యాలయంలో మండలంలో ప్రభు త్వ పాఠశాలల హెచ్ఎంలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంఈవో-2 పి.రామకృష్ణ పాల్గొన్నారు.

వరి విత్తన దుకాణాల తనిఖీ

మొగల్తూరు, జూన్ 26 : స్థానిక వరి విత్తనాలు విక్ర యించే దుకాణాలను బుధవారం మండల వ్యవసాయాధి కారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ ఒక దుకాణంలో రికార్డులు పరిశీ లించి నాలుగు రకాల విత్తనాలు సేకరించి విత్తన పరీక్షా కేంద్రానికి పంపామన్నారు.

130 మందికి వైద్య పరీక్షలు

తణుకు, జూన్ 26: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సంఘ కార్యాలయంలో డెల్టా ఆసుపత్రి వైద్యులు 130 మందికి ఉచితంగా పలు వైద్య పరీక్షలు చేశారు. సంఘ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, డాక్టర్ సుధా ప్రశాంతి, న్యాయవాదులు ఈదా రామకృష్ణ, మత్యుంజయరావు, నండూరి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

పెంటపాడు, జూన్ 26: పశువులకు తప్పనిసరిగా గొంతువాపు నివారణ టీకాలు వేయాలని తాడేపల్లిగూడెం డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. కె.పెంటపాడులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బుధవారం పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ పీతల సత్యనారాయణ ప్రారంభించారు. రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, కాల్షియం అరుకు ఉచితంగా అందజేశారు. ఉప సర్పంచ్ పంతం శివరామకృష్ణ, డాక్టర్ మహేష్, సిబ్బంది రాజాసత్యశ్రీ, గోపాలమిత్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 26 : ఇంజనీరింగ్‌లో చేరే ప్రతిభ కలిగి, ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు దాతల సహ కారంతో ప్రోత్సహిస్తామని డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు అన్నారు. కళా శాలలో బుధవారం కొంత మంది విద్యార్థులకు ఈ సహకా రాన్ని అందించారు. కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారా యణరాజు మాట్లాడుతూ మంతెన రామలింగరాజు ఫౌండే షన్, వసుధ ఫౌండేషన్, కొత్త శ్రీనివాస్, పెన్మెత్స జగ్గరాజు వంటి వారిచే విద్యార్థులు చదువుకునేందుకు స్కాలర్‌షిప్ అందించడం జరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ అంజనికు మార్, తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజితో కరెంటు కష్టాలు

పాలకొల్లు రూరల్, జూన్, 26 : రూరల్ పంచాయితీ పరిధిలోని సబ్బేవాని పేటలో రెండు నెలలుగా లోవోల్టేజి సమస్య తీవ్రతరంగా ఉంది. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రతీ రెండు గంటలుకూ లోవోల్టేజి ఏర్పడుతుంది. దీంతో ఇళ్లల్లో ఫ్యాన్లు స్పీడుగా తిరగక, ట్యూబ్‌లైట్లు వెలగక కరెంట్ కష్టాలతో ప్రజలు రోజూ నరకం చూస్తున్నారు. విద్యుత్ శాఖధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి లోవోల్టేజి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

29న పీడీఎస్‌యూ సమావేశాలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 26: విజయవాడలో ఈ నెల 29న జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు రూపాశంకర్ కోరారు. తాడేపల్లిగూడెంలో బుధవారం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల కరపత్రాలు ఆవిష్కరించారు. జార్జిరెడ్డి, జేఏసీ ప్రసాద్, కోలా శంకర్ పాల్గొన్నారు.

ఆగస్టు 30 వరకు అవగాహన కార్యక్రమాలు

గణపవరం, జూన్ 26: డయేరియాపై అవగాహన కార్యక్ర మాలను ఆగస్టు 30 వరకు నిర్వహించాలని ఎంపీడీ వో సూర్యనారాయణ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాల యంలో బుధవారం మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్షా, సమావేశం నిర్వహించారు. ఆయన శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకో వాలన్నారు. అనంతరం ప్రభు త్వం వైద్యాధికారి సంతోష్ మాట్లాడారు. ఎంఈవో పి.శేషు, ఎంపీహెచ్‌వోలు విల్సన్‌బాబు, వెంకటేశ్వర్లు, హెచ్‌వీ టి.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.